సాక్షి ప్రకాశం
గురువారం । 6 । జూలై । 2023



విధుల్లో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం
అధికారులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు.
- 8లో..



బాధిత రైతులకు త్వరలో పరిహారం
గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులకు త్వరలో పరిహారం అందిస్తామని జేసీ శ్రీనివాసరావు తెలిపారు.
- 8లో..

గరిష్టం/కనిష్టం 30/26

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కేంద్రీయ విద్యాలయం బాలవాటిక-3కి ఎంపిక

ఒంగోలు అర్బన్: స్థానిక భాగ్యనగర్‌లోని కేంద్రీయ విద్యాలయం బాలవాటిక-3కి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బీ సూర్యప్రకాశరావు తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి బాలవాటిక కింద ప్రీప్రైమరీ తరగతులు నిర్వహించేందుకు కేంద్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దానిలో భాగంగా 40 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. 2023 మార్చి 31 నాటికి ఐదేళ్ల వయసు నిండి ఆరు సంవత్సరాల వయసులోపు పిల్లలు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన తల్లిదండ్రులు ఈ నెల 6 నుంచి 18వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 20వ తేదీ ఎంపిక ప్రక్రియ నిర్వహించి 28వ తేదీ వరకు అడ్మిషన్‌లు నిర్వహిస్తామన్నారు. 29వ తేదీ నుంచి బాలవాటిక-3 తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. వివరాలకు kvsonineadmirrion.kvr.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

సఖీ కేంద్రం పరిశీలన



సఖీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు బత్తుల పద్మావతి

ఒంగోలు అర్బన్: జిల్లా కేంద్రంలో సఖీ, దిశ వన్‌స్టాప్ కేంద్రాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు బత్తుల పద్మావతి బుధవారం పరిశీలించారు. కేంద్రం నడుస్తున్న తీరుతెన్నులు, భోజన వసతిలపై ఆరా తీశారు. షెల్టర్‌లో ఉన్న తల్లిబిడ్డలతో మాట్లాడి పిల్లలతో బిక్షాటన చేయించడం నేరమన్నారు. బాలికల చదువులను పునరుద్ధరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పోక్సో కేసు బాధితురాలికి తన ఇష్టం మేరకు స్కూలు అడ్మిషన్ ఇప్పించారు. సదరు బాధితురాలికి తక్షణమే నష్టపరిహారం అందేలా అన్నీ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. దీనిలో మహిళా శిశు సంక్షేమ అధికారి కే మాధురి, డీసీపీవో దినేష్‌కుమార్, సీడబ్ల్యూసీ సభ్యులు సీలిమ, దిశ పోలీసు స్టేషన్ సీఐ మల్లికార్జున్, సీడీపీవో సులోచన, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



ముండ్లమూరు మండలం వేముల-2 సచివాలయం పరిధిలోని వేములబండ గ్రామానికి చెందిన దిరిశాల రామానాయుడు ఎకరా 96 సెంట్లలో బీపీటీ-5204 రకం వరి సాగు చేశాడు. నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో ఈ ఏడాది నీరు సక్రమంగా రావడంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా పంట పండింది. ఎకరానికి రూ.20 వేల వరకు ఖర్చు అయింది. అలాగే ఎకరానికి 32 క్వింటాళ్ల పంట దిగుబడి వచ్చింది. క్వింటా రూ.2 వేల చొప్పున పంటను అమ్ముకున్నాడు. ఖర్చులు పోను రూ.40 వేల వరకు ఆదాయం వచ్చింది. ముండ్లమూరు, పసుపుగల్లు, వేముల-2 సచివాలయాల పరిధిలోని 448 మంది రైతులు ఉన్నారు. వీరి సగటు పంటకోత ప్రయోగం ఆధారంగా అధికారులు రూపొందించిన నివేదికల ప్రకారం పెట్టుబడులు పోను సగటున ఆదాయం వచ్చింది. నిబంధనల ప్రకారం ప్రభుత్వం అదనంగా బీమా డబ్బులు చెల్లించింది. అయితే వాస్తవాలు వక్రీకరిస్తూ ఈనాడు పత్రిక రైతులకు కేవలం రూ.32 చెల్లించారంటూ అసత్య కథనాన్ని ఇచ్చింది.



సకాలంలో పరిహారం..
ఈ చిత్రంలో కనిపిస్తున్న దేవండ్ల కృష్ణ. పీసీపల్లిలో రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేశాడు. తెగుళ్ల కారణంగా పంట దిగుబడి సరిగా రాలేదు. పంటల బీమా పథకం కింద పంటకు ఈ క్రాప్ నమోదు చేయించాడు. పంట నష్టపోవడంతో పరిహారం కింద రూ.62,300 ప్రభుత్వం నుంచి అందింది. సకాలంలో పరిహారం రావడంతో తిరిగి ఈ ఏడాది ధైర్యంగా పంట వేయడానికి సిద్ధమయ్యాడు. చంద్రబాబు ప్రభుత్వం పంట నష్టపోయినప్పుడు ఒక్కరూపాయి కూడా విదల్చలేదు. వ్యవసాయం చేయాలంటేనే దేవుడిపై భారం వేసేవాళ్లం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక మాకు అన్ని రకాలుగా అండగా ఉంటున్నారు. పంట నష్టపరిహారం ఇస్తూ ఆదుకుంటున్నారు అంటున్నాడు దేవండ్ల కృష్ణ.

పరిహారంపై పచ్చ విషం



- రైతులకు పారదర్శకంగా పరిహారం
- నిబంధనల మేరకే పంటల బీమా
- పత్తి, మిరప వర్షాధార పంటలకు చెల్లింపులు
- వాతావరణ పరిస్థితుల ఆధారంగా పరిహారం లెక్కింపు
- దిగుబడి ఆధారంగా వరి పంటకు పరిహారం
- టీడీపీ ప్రభుత్వ హయాంలో బీమా ఊసే లేదు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ఎల్లోమీడియా అసత్య కథనాలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

గత తెలుగుదేశ ప్రభుత్వం ఏనాడూ రైతును పట్టించుకోలేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సైతం తుంగలో తొక్కి దగా చేసింది. నాడు ఎల్లో మీడియాకు రైతుల వెతలు కనిపించలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాతల పక్షాన నిలిచింది. అన్ని సేవలూ అన్నదాత ముంగిటకే తీసుకొచ్చింది. ప్రభుత్వం లాగే వరుణుడు సైతం కరుణించాడు. ఏ సీజన్‌లోనూ కరువు ఛాయలు కనిపించలేదు. ఒక వేళ ప్రకృతి విపత్తుల కారణంగా పంటలు పండకపోతే రైతులను ఆదుకోవటానికి ప్రభుత్వం పంటల బీమా ఏర్పాటు చేసింది. సీజన్ల వారీగా పంటలు వేసే సమయంలోనే ప్రభుత్వం ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని చేపట్టి ఈ-పంట యాప్‌లో నమోదు చేసుకున్న ప్రతి రైతుకు ప్రభుత్వమే రైతు తరఫున ఉచితంగా పంటల బీమా ప్రీమియాన్ని చెల్లిస్తూ వస్తోంది. పంటల దిగుబడిని బట్టి సరాసరి ఆధారంగా బీమా ప్రీమియం రైతులకు చెల్లిస్తోంది.

పంటలు పుష్కలంగా పండాయి...
2022 ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 29,562 ఎకరాల్లో వరిసాగు చేశారు. అందుకుగాను 62,129 టన్నుల దిగుబడి వచ్చింది. అంటే సరాసరి 28 బస్తాలు పండినట్లయింది. ఆ సీజన్‌లోనే 35 బస్తాలు పండించిన రైతులు కూడా ఉన్నారు. ఐదు సంవత్సరాల సరాసరి ధాన్యం దిగుబడిని ఆధారం చేసుకొని దిగుబడి తగ్గిన గ్రామాల్లో నష్ట పరిహారాన్ని అందిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. డాక్టర్ వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా-ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద పంటల బీమా కింద 2022 ఖరీఫ్ సీజన్‌లో పండించిన పంటలకు పారదర్శకంగా పంటల బీమా పరిహారాన్ని ప్రకటించింది. ఆర్‌బీకేల్లో రైతుల జాబితాలను ప్రచురించింది. అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించింది. ఖరీఫ్-2022 సీజన్‌కు గాను కంది, వరి, సజ్జ, మినుము, ఎండు మిర్చి పంటలను బీమా పరిహారం కింద చేర్చారు. వాతావరణం ఆధారంగా మిరప, పత్తి పంటలను, దిగుబడి ఆధారంగా వరి, సజ్జ, కంది పంటలను కేటాయించారు. ప్రతి పంటను ఈ-పంట యాప్‌లో నమోదు చేసి ప్రతి రైతు బయోమెట్రిక్ ధ్రువీకరణ తీసుకున్నారు. దిగుబడి ఆధారంగా పంట నష్టం అంచనాలను లెక్కించేందుకు జిల్లా వ్యాప్తంగా 1587 పంట కోత ప్రయోగాల ఫలితాలను పరిగణలోకి తీసుకొని పరిహారాన్ని లెక్కించారు. హామీ దిగుబడికన్నా వాస్తవ దిగుబడి తగ్గిన చోట మాత్రమే పంట నష్ట పరిహారం వర్తిస్తుంది. అదేవిధంగా వాతావరణ ఆధారిత పంట నష్టం అంచనా కోసం జిల్లావ్యాప్తంగా 185 ఏడబ్ల్యూఎస్ వాతావరణ కేంద్రాల్లో నమోదైన సమాచారం ప్రకారం పరిగణలోకి తీసుకొని నష్టం అంచనాలు వేశారు. అందులో భాగంగా అధిక లేదా లోటు వర్షపాతం, ఉష్ణోగ్రతలు, గాలిలో తేమ శాతం మొదలైన ప్రమాణాలను పరిగణలోకి తీసుకున్నారు.

టీడీపీ ప్రభుత్వ హయాంలో బీమా ఊసే లేదు..
టీడీపీ ప్రభుత్వ హయాంలో పంటల బీమా పరిహారం ఊసే లేదు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో మొత్తం కరువు కాటకాలే. అటు ఖరీఫ్ ఇటు రబీ సీజన్లలో ఐదేళ్లూ కరువు మండలాలు ప్రకటిస్తూనే వచ్చింది. బీమా ప్రీమియాన్ని చంద్రబాబు ప్రభుత్వం చెల్లించలేదు. అలాగే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పంటల బీమా ప్రీమియాన్ని ప్రభుత్వ పెద్దలు కాజేశారు. రైతులు విలవిల్లాడిపోయినా ఎల్లో మీడియాకు రైతుల కష్టాలు కనిపించలేదు. నేడు పారదర్శకంగా పంటల బీమా పరిహారాన్ని ఇస్తున్నా రైతులకు అన్యాయం చేస్తున్నారంటూ అసత్య కథనాలు వండి వారుస్తున్నాయి. మసకబారిపోతున్న టీడీపీ గ్రాఫ్‌ను పెంచేందుకు తెగ ఆరాట పడిపోతున్నాయి.

రైతులకు మొండిచేయి అంటూ అసత్య కథనాలు
ప్రభుత్వం పారదర్శకంగా రైతులకు మేలు చేస్తుంటే ఎల్లో మీడియా పనికట్టుకొని అసత్య కథనాలకు తెరతీసింది. మిరప, పత్తి రైతులకు ప్రభుత్వం మొండి చేయి అని అసత్య కథనాలు వండి వార్చాయి. కంది, పత్తి పంటలకేనా ప్రధానమంత్రి ఫసల్ బీమా అని కూడా తప్పుడు కథనాలను ఇచ్చాయి. పంటల బీమా సమయంలో ఏఏ పంటలకు ఎలాంటి బీమా వర్తిస్తుందో ముందుగానే ప్రకటించింది ప్రభుత్వం. అవేమీ పట్టించుకోకుండా, నిబంధనలు తెలుసుకోకుండా ప్రభుత్వంపై బురద జల్లే కార్యక్రమానికి తెరలేపాయి. జిల్లాలో వాతావరణ ఆధారిత బీమా ప్రకారం మిరప పంటకు మద్రిపూడి, పీసీపల్లి మండలాల్లో మాత్రమే నష్టం వాటిల్లింది. రెండు మండలాలు కలిపి 40 మంది రైతులు మాత్రమే నష్టపోయిన వారు ఉన్నారు. పీసీపల్లి మండలంలో 14 మంది రైతులకు 23 ఎకరాలకు గాను రూ.2,20,451.84 పరిహారం వచ్చింది. అంటే సరాసరిన ఒక్కో ఎకరాకు రూ.9,584.86 పరిహారం ఇచ్చినట్లయింది. అదేవిధంగా మద్రిపూడి మండలంలో 26 మంది రైతులకు 30.68 ఎకరాలకు గాను రూ.81,273.60 పరిహారాన్ని అధికారులు ఇచ్చారు. అదేవిధంగా పత్తి పంటకు 18 మండలాల్లో పరిహారాన్ని ప్రకటించారు. 16,777 మంది రైతులకుగాను 31,477 ఎకరాల్లో పంట దిగుబడి తగ్గిన మేరకు పరిహారాన్ని ప్రకటించారు. అందుకుగాను రూ.8,77,20,427 పరిహారాన్ని అధికారులు ప్రకటించారు. అంటే ఒక్కో ఎకరాకు సరాసరిన రూ.2786.81 పరిహారాన్ని ఇచ్చారన్నమాట.

దిగుబడి ఆధారంగా మూడు రకాల పంటలకు
ఖరీఫ్-2022లో దిగుబడి ఆధారంగా మూడు పంటలకు ప్రభుత్వం పంట నష్ట పరిహారాన్ని ప్రకటించింది. వాటిలో ప్రధానమైనది కంది. ఆ తరువాత సజ్జ, వరి పంటలు ఉన్నాయి. కంది పంటను మండలం యూనిట్‌గా తీసుకున్నారు. మొత్తం 35 మండలాల్లో పంట నష్ట పరిహారం ప్రకటించారు. అందుకుగాను రూ.171.45 కోట్లు రైతులకు పరిహారంగా అందించనున్నారు. ఇకపోతే సజ్జ పంట 9 మండలాల్లో నష్ట పరిహారాన్ని ప్రకటిస్తే, మండలం యూనిట్‌గా తీసుకొని పంట నష్టాన్ని అంచనా వేసిన ప్రకారం రూ.27.18 లక్షలు రైతులకు ఇచ్చేలా ప్రకటించారు.

మూడో పంట వరి. జిల్లాలో మూడు మండలాల్లో మాత్రమే వరి నష్టం సంభవించినట్లు తేల్చారు. అవి చీమకుర్తి, ముండ్లమూరు, పుల్లలచెరువు. మూడు మండలాల్లో కలిపి 11 గ్రామాలు మాత్రమే నష్టం వాటిల్లింది. మూడు మండలాల్లో కలిపి రూ.49,96,842 పరిహారంగా ప్రకటించారు.

దిగుబడి పెరిగే కొద్దీ బీమా పరిహారం తగ్గుతుంది
ఖరీఫ్-2022లో పంటలు పూర్తిగా నష్టపోయింది లేదు. కొన్ని పంటలు ఒక మోస్తరుగా, కంది పంటకు కొంత ఎక్కువగా నష్టం వాటిల్లింది. ప్రధానంగా పంటలు పండాయి. కాకపోతే దిగుబడి కొంచెం తగ్గింది. దిగుబడి పెరిగేకొద్దీ బీమా పరిహారం తగ్గుతుంది. అందులో భాగంగా వరి పంటకు సరాసరిన చూసిన ఒక బస్తాలోపే దిగుబడి తగ్గింది. కొన్ని చోట్ల కేజీల్లో దిగుబడి తగ్గింది. ఆ సీజన్‌లో కంది రైతులకు నష్టం వాటిల్లింది కాబట్టే జిల్లాలో రూ.171.45 కోట్లు పరిహారాన్ని ప్రభుత్వం రైతులకు అందించనుంది. వరి పంట 29,562 ఎకరాల్లో సాగుచేస్తే 62,129 టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. అంటే ఒకటి, రెండు శాతం మాత్రమే దిగుబడి తగ్గటం వల్ల ఆ తగ్గిన మొత్తానికి కూడా రైతులకు ఎంత వస్తే అంత పరిహారాన్ని ప్రభుత్వం అందిస్తోంది. కొన్ని పత్రికలు పూర్తిగా సమాచారం తెలుసుకోకుండా అసత్య కథనాలు ప్రచురిస్తున్నారు. మమ్మల్ని అడిగితే పూర్తిగా లెక్కలతో సహా వేసి వివరిస్తాం కదా.
– ఎస్.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి

మున్నంగి సీఫుడ్స్‌లో కార్మికులకు అస్వస్థత



అధికారుల బృందంతో కలిసి మున్నంగి సీఫుడ్స్ కంపెనీలో పరిశీలిస్తున్న వరికూటి



ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మహిళా కార్మికులు

- అమ్మోనియా గ్యాస్ లీకేజ్ అంటూ పుకార్లు
- 16 మందికి ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స
- వైరల్ జ్వరాలేనని వైద్యుల ధ్రువీకరణ
- కార్మికులు ఆరోగ్యంతో ఉన్నారని ప్రకటించిన కలెక్టర్

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలంలోని మున్నంగి సీఫుడ్స్ కంపెనీలో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళా కార్మికులు 16 మంది బుధవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో విషయం తెలుసుకున్న కంపెనీ యాజమాన్యం తమ వాహనాల్లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించి చికిత్స చేయించింది. ఆస్పత్రి వైద్యులు బాధితుల రక్తనమూనాలు సేకరించి పరీక్షలు చేయించారు. ఇదిలా ఉండగా అమ్మోనియా గ్యాస్ లీక్ అవడంతోనే అస్వస్థతకు గురయ్యారని పుకార్లు వ్యాపించాయి. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు మత్స్యశాఖ జేడీ చంద్రశేఖరరెడ్డి, పరిశ్రమల శాఖ డీసీ పరమేశ్వరరావు, పొల్యూషన్ కంట్రోల్ ఈఈ రాఘవరెడ్డి, మండల ప్రభుత్వ వైద్యాధికారి సరస్వతి, తహశీల్దార్ ఎస్ ఉషారాణి, సీఐ దాచేపల్లి రంగనాథ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ విషయం తెలిసిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అధికారుల బృందంతో కలిసి పరిస్థితిని పరిశీలించారు. కార్మికులు అస్వస్థతకు గురికావటానికి అమ్మోనియా గ్యాస్ లీకేజ్ కారణం కాదని పొల్యూషన్ కంట్రోల్ అధికారి రాఘవరెడ్డి నిర్ధారించారు. ఇతర కారణాలు ఏమైనా ఉంటాయని పరిశీలించారు. కార్మికులు నివసించే క్వార్టర్స్‌ను, వాటి పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాస్తవానికి పరిసరాలతో పాటు క్వార్టర్స్ కూడా పరిశుభ్రంగా ఉన్నాయని కార్మికులకు పూర్తి స్థాయిలో రక్త పరీక్షలు చేస్తే తప్ప అనారోగ్యానికి కారణాలు తెలియవని అధికారులు తెలిపారు. ఇదే విషయాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ కూడా నిర్ధారించారు. ఒంగోలు జీజీహెచ్‌లో చేరిన 16 మంది కార్మికులు పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని, వీరిలో 15 మందిని సాయంత్రానికి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారని, ఒకరిని మాత్రం గురువారం డిశ్చార్జి చేస్తారని అధికారులు తెలిపారు. వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ తాను అధికారులతో కలిసి కంపెనీలోని కార్మికుల క్వార్టర్స్, కంపెనీ పరిసరాలు, కంపెనీ లోపలి గదులను పరిశీలించానని అంతా పరిశుభ్రంగానే ఉందని వివరించారు. కార్మికులకు పూర్తిస్థాయి రక్త పరీక్షలు నిర్వహించాలని ఆయన అధికారులకు సూచించారు. కార్మికులకు ఎటువంటి అనారోగ్యం లేకుండా పూర్తి ఆరోగ్యంగా ఉండటం పట్ల తోటి కార్మికులు, కంపెనీ యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికులకు వైరల్ ఇన్‌ఫెక్షన్
ఒంగోలు అర్బన్: మున్నంగి సీఫుడ్స్‌లో పనిచేస్తున్న కార్మికులు వైరల్ ఇన్‌ఫెక్షన్ లక్షణాలతో ఆస్పత్రిలో చేరినట్లు జీజీహెచ్ వైద్యులు తెలిపారు. అమోనియం గ్యాస్ లీకేజి వంటి కారణాలు కాదని స్పష్టం చేశారు. ఒక్కరిని మినహా మిగతా వారిని డిశ్చార్జ్ చేస్తారని తెలిపారు.

ఆధునిక బోధన పద్ధతులను పాటించాలి

● డీఈఓ రమేష్

కనిగిరి రూరల్: ఉపాధ్యాయులు ఆధునిక బోధన పద్ధతులను అందిపుచ్చుకుని విద్యా బోధన చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ అన్నారు. స్థానిక ఏబీఆర్ కళాశాలలో కోర్సు డైరక్టర్ రాజాల కొండారెడ్డి అధ్యక్షతన ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ రమేష్ మాట్లాడుతూ ఆధునిక ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ పై బోధన విధానాలను నేర్పించేందుకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లాలోని 6,777 మంది ఉపాధ్యాయులకు, కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన 975 మంది ఉపాధ్యాయులకు శిక్షణ జరుగుతున్నట్లు చెప్పారు. 6-10 తరగతుల వరకు విద్యా బోధన ఇక నుంచి డిజిటల్ విధానంలో ఐఎఫ్‌పీ ప్యానల్స్‌ను ఉపయోగించి బోధించాలన్నారు. దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విద్యా బోధన ఏపీలో అమలవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓలు దేవిరెడ్డి రామిరెడ్డి, ఎంవీ నారాయణరెడ్డి, జే ప్రసాద్‌రావు, ఆర్ శ్రీనివాసరావు, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ రమేష్

ఎక్కడికక్కడే పరిష్కారం

ఒక్కొక్కరిది ఒక్కో సమస్య. గతంలో అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా కాని పనులు దరఖాస్తు చేసుకున్న గంటల వ్యవధిలోనే ఉచితంగా అయిపోతున్నాయి. జిల్లాలో ముమ్మరంగా సాగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో వేలాది మంది లబ్ధిదారులు తమకు కావాల్సిన సర్టిఫికెట్లను సులువుగా పొందుతున్నారు. అవసరమైన సర్టిఫికెట్ల కోసం మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పనిలేకుండా ఎక్కడికక్కడ సమస్య పరిష్కరించి అందజేస్తుండటంతో లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేవు. బుధవారం కూడా జిల్లాలోని పలుచోట్ల జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించి దరఖాస్తుదారులకు అవసరమైన ధ్రువపత్రాలు అందజేశారు.
– సాక్షి నెట్‌వర్క్



చీమకుర్తిలో సర్టిఫికెట్‌లు అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

సులువుగా ఆదాయ ధ్రువీకరణ పత్రం



ఇతని పేరు దూదిపల్లి హరిబాబు. కొండపి మండలం పెదకండ్లగుంట పంచాయతీ. ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఇతని ఇంటికి వాలంటీర్లు వెళ్లి అవసరమైన సర్టిఫికెట్ల గురించి చెప్పి సిద్ధం చేశారు. సీఎం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామ సచివాలయం వద్ద ఇతనికి అధికారులు ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. గతంలో ఇదే సర్టిఫికెట్ కోసం పొలం పనులు సైతం రెండు మూడు రోజులు మానుకుని కొండపి మండల కార్యాలయం చుట్టూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తేగానీ అందని సర్టిఫికెట్ నేడు జగనన్న పాలనలో సొంతూరిలోనే తీసుకున్నందుకు హరిబాబు ఆనందం వ్యక్తం చేశాడు.

రూపాయి ఖర్చులేదు.. సమయం వృథాకాలేదు



ఈమె పేరు షేక్ మెహరూన. భర్త మస్తాన్‌వలి బేస్తవారిపేటలో కూల్‌డ్రింక్ బండి పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. రేషన్‌కార్డులో 10 ఏళ్ల కూతురు హసినా పేరు చేర్చేందుకు పలుమార్లు అధికారులు చుట్టూ తిరిగింది. ధ్రువపత్రాలు తీసుకోవడం నమోదు చేస్తామని చెప్పడం తప్ప పనిజరగలేదు. నేడు జగనన్న సురక్ష పథకంలో వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి సంబంధించిన పత్రాలు తీసుకెళ్లి రేషన్‌కార్డులో కుమార్తె పేరు నమోదు చేశారు. రూపాయి ఖర్చు లేకుండా సమయం వృథా కాకుండా జగనన్న సురక్ష పథకంలో రేషన్‌కార్డులో పేరు నమోదు చేశారని ఆమె హర్షం వ్యక్తం చేసింది.

శ్రమ లేకుండా కౌలుకార్డు



ఇతని పేరు ఎం.శ్రీనివాసులు. రాచర్లఫారంలో కౌలు రైతుగా జీవనం సాగిస్తున్నాడు. కౌలురైతు గుర్తింపు కార్డు కోసం గతంలో రెవెన్యూ, వ్యవసాయాధికారులను అడిగినా గుర్తింపుకార్డు దక్కలేదు. జగనన్న సురక్ష కార్యక్రమంలో పైసా ఖర్చు లేకుండా గ్రామ వలంటీరు ఇంటి దగ్గరికి వచ్చి సంబంధిత పత్రాలు తీసుకుని వెంటనే పంటసాగుదారుల పత్రం (కౌలుదారు కార్డు) వెంటనే మంజూరు చేశారు. శ్రమ లేకుండా కౌలు కార్డు దక్కిందంటూ శ్రీనివాసులు సంతోషంగా తెలిపాడు.

ప్రభుత్వ పథకాలకు అర్హత కల్పించారు




ముండ్లపాడుకు చెందిన దూదేకుల చిన్నఖాశింపీరా వృత్తి రీత్యా బేల్దారి పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. గత ప్రభుత్వం అడ్డగోలు సర్వే జరిపి అతని పేరు మీద ఆస్తులు ఉన్నాయంటూ రేషన్‌కార్డును అన్యాయంగా తొలగించారు. జగనన్న సురక్ష పథకం ద్వారా వలంటీరు వచ్చి రేషన్ కార్డుకు దరఖాస్తు చేయించడంతో వెంటనే కార్డు మంజూరైంది. తిరిగి రేషన్ కార్డు పొందానని...దీంతో తన కుటుంబం ప్రభుత్వ పథకాలను పొందే అవకాశం దక్కిందని చిన్నఖాశింపీరా హర్షం వ్యక్తం చేశాడు.

ఖర్చు, ఇబ్బంది లేకుండా కుల ధ్రువీకరణ పత్రం



ఈమె పేరు మల్లెల అంజలి, యర్రగొండపాలెం మండలంలోని బోయలపల్లె గ్రామం. జగనన్న సురక్ష క్యాంపులో కుల ధ్రువీకరణ, ఇన్‌కం పత్రం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకుంది. వలంటీరు ఇంటికి వచ్చి ఆమెకు అవసరమైన సర్టిఫికెట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. 8 నెలల నుంచి ఆ పత్రాల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయింది. జగనన్న సురక్ష క్యాంపులో ఎటువంటి ఖర్చు, ఇబ్బంది లేకుండా తనకు కావాల్సిన సర్టిఫికెట్లు అందడంతో ఆమె ఆనందంగా సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది.

గంటల వ్యవధిలో కౌలు గుర్తింపు కార్డు



ఇతని పేరు చందాల ఏసురత్నం. గిద్దలూరు మండలం అంబవరం గ్రామంలో పొలం కౌలుకు తీసుకుని సాగుచేసుకుంటున్నాడు. కౌలు రైతు గుర్తింపుకార్డు కోసం గతంలో ఎన్ని సార్లు అర్జీలు ఇచ్చినా కౌలు గుర్తింపు కార్డు రాలేదు. ప్రస్తుతం జగనన్న సురక్ష పథకం కింద దరఖాస్తు చేసుకోవడంతో గంటల వ్యవధిలోనే కౌలు గుర్తింపు కార్డు ఇచ్చారు. అధికారుల చుట్టూ తిరిగే పనిలేకుండా సులువుగా కౌలు కార్డు ఇచ్చారని.. జగనన్న ప్రభుత్వానికి రుణపడి ఉంటానని ఏసురత్నం సంతోషంగా తెలిపాడు.

క్లుప్తంగా

9న నారాయణస్వామి ఆరాధన మహోత్సవం

సీఎస్‌పురం(పీసీపల్లి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణ స్వామి ఆరాధన మహోత్సవం ఈ నెల 9న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఈఓ నర్రా నారాయణరెడ్డి, చైర్మన్ కె.ఆదినారాయణ తెలిపారు. ఆరాధన మహోత్సవంలో భాగంగా స్వామివారికి పంచామృత పంచగవ్యాలతో అభిషేకం, గణాధిపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, పల్లకి సేవ, పంచ హారతులు, మహానైవేద్యం, నవగ్రహ హోమాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి

- రాష్ట్ర యునైటెడ్ డిఫెన్స్ వెటరెన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు


మాట్లాడుతున్న రాష్ట్ర యునైటెడ్ డిఫెన్స్ వెటరెన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు

బేస్తవారిపేట: మాజీ సైనికులు, సైనికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తామని రాష్ట్ర యునైటెడ్ డిఫెన్స్ వెటరెన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నెప్పల్లి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక మాజీ సైనికుల సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని మాజీ సైనికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సైనికుల కుటుంబాలకు ఉద్యోగ, విద్యలో ఉన్న 2 శాతం రిజర్వేషన్‌ను కేంద్ర ప్రభుత్వం పెంచాలని, నివేశన స్థలాలు కేటాయించాలని కోరారు. ప్రకాశం జిల్లాలో సైనికులు, మాజీ సైనికులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని డిఫెన్స్‌కు సంబంధించిన సంస్థలను ఏర్పాటు చేయడంతో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. సంస్థల ఏర్పాటుకు ఈ జిల్లాలో అధికంగా ప్రభుత్వభూమి ఉందన్నారు. గిద్దలూరు పరిసర ప్రాంతంలో సైనిక పాఠశాల ఏర్పాటుకు కోసం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏ వెంకటేశ్వర్లు, కార్యదర్శి పీ వెంకటరాజు, మండల అధ్యక్షుడు బొల్లా బాలిరెడ్డి, ఆరు మండలాల్లోని మాజీ సైనికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు

విధుల్లో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం

- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకుంటే చర్యలు
- ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి హెచ్చరిక
- ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన కల్పించాలని సూచన
- పశ్చిమ ప్రకాశంలోని పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


కంభంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ చైర్మన్

కంభం/బేస్తవారిపేట/మార్కాపురం: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టల్స్, పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకపోతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. బుధవారం పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, కంభం, బేస్తవారిపేట మండలాల్లో ఆయన పర్యటించారు.

■ మార్కాపురం పట్టణంలోని నాగులపుట్ట వీధి, కొండేపల్లి రోడ్డులోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఓ అంగన్‌వాడీ కేంద్రంలో కాల పరిమితి ముగిసిన ఆయిల్ ప్యాకెట్లను గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు అంగన్‌వాడీ టీచర్‌కు మెమో ఇవ్వాలని ఆదేశించారు. హాస్టళ్లలో బిల్లులు ఆలస్యమయ్యాయని సాకుగా చూపి విద్యార్థులకు భోజనం పెట్టకుండా ఉండవద్దని వార్డెన్లకు చెప్పారు. తల్లిదండ్రులకు దూరంగా హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులపై ఆప్యాయత చూపాల్సిన బాధ్యత వార్డెన్లపై ఉందన్నారు. ఆయన వెంట ఐసీడీఎస్ అధికారులు బుజ్జి, రవికుమారి, గోడౌన్ డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ ఉన్నారు.


బేస్తవారిపేటలో కేజీబీవీ విద్యార్థులతో మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

■ కంభం మండలం జంగంగుంట్ల ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసిన అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా ఫుడ్ కమిషన్ పనిచేస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులకు అందించే ఫోర్టిఫైడ్ బియ్యంలో ఫోలిక్ యాసిడ్, ఐరన్, విటమిన్స్ పుష్కలంగా ఉంటాయనే విషయంపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. డీలర్లు, ఎండీఎం ఆపరేటర్లు బాధ్యతగా పనిచేసి ప్రజలకు రేషన్ సరుకులు అందించాలని సూచించారు. ధరలకు సంబంధించిన ఫ్లెక్సీని వాహనాల్లో ఏర్పాటు చేయాలన్నారు. కాటా సరిచూసుకున్న తర్వాతే గోడౌన్ల నుంచి బియ్యం తీసుకోవాలని తద్వారా ఎవరికీ నష్టం జరగదన్నారు. తదనంతరం కందులాపురం కాలనీ, తెలుగు వీధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను విజయప్రతాప్ రెడ్డి తనిఖీ చేశారు. గర్భిణులు, పిల్లలతో మాట్లాడి, భోజనాన్ని రుచి చూశారు. కందులాపురం కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో గడువు తీరిన కంది పప్పు ప్యాకెట్లు ఉండటంపై ఆగ్రహించిన ఆయన సూపర్‌వైజర్, కార్యకర్తకు మెమో జారీ చేయాలని ఐసీడీఎస్ ఉన్నతాధికారులను ఆదేశించారు.

మెనూ తప్పనిసరి

కంభం మండలంలోని జంగంగుంట్ల ప్రాథమిక పాఠశాల, స్థానిక అంబెద్కర్ గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నతపాఠశాల, రంగరాజు ఎయిడెడ్ స్కూల్లోని వంటగదులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యపై ఆరా తీశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.2 వేల నగదు బహుమతి అందజేశారు. ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ, రేషన్ డీలర్లు, ఉపాధ్యాయులు చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటి డైరెక్టర్ సురేష్, జిల్లా సివిల్ సప్లై అధికారి ఉదయ భాస్కర్, తహసీల్దార్ శైలేంద్రనాథ్, డీటీలు ప్రసాద్, గంగిరెడ్డి, ఆర్ఐ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదువుకోవాలి

బేస్తవారిపేటలోని కస్తూర్బా గురుకుల పాఠశాల, జెడ్పీ బాలికల హైస్కూల్, ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఫుడ్ కమిషన్ చైర్మన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో పోటీతత్వం బాగా పెరిగిందని, ఇష్టపడి చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని దేశంలో ఎక్కడా లేని విధంగా ఫోర్టిఫైడ్ రైస్‌ను మధ్యాహ్న భోజనానికి వినియోగిస్తున్నట్లు చెప్పారు. బాలికల హైస్కూల్లో ఫోర్టిఫైడ్ రైస్‌పై విద్యార్థినులకు అవగాహన లేకపోవడంతో హెచ్‌ఎం కర్నాటి తిరుపతిరెడ్డికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాశాఖ అధికారి ఉదయ్‌భాస్కర్, తహసీల్దార్ డీవీబీ వరకుమార్, ఎంఈఓలు సీవీ రమణారెడ్డి, మాల్యాద్రి, డీటీ జితేంద్రకుమార్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పిడతల గంగిరెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ అనిల్‌కుమార్, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలు చేసిన వారిపై కఠిన చర్యలు

- ఆర్డీఓ టీ అజయ్ కుమార్

కనిగిరి రూరల్: రెవెన్యూ అధికారుల దొంగ స్టాంప్‌లు, ఫోర్జరీ సంతకాలతో నకిలీ పట్టాలు సృష్టించే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని ఆర్డీఓ టీ అజయ్ కుమార్ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గతంలో తాను కనిగిరిలో తహసీల్దార్‌గా పనిచేసినప్పుడు కొందరు పేదలకు ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులంతా కలిసి పట్టాలు పంపిణీ చేసింది వాస్తవమేనన్నారు. ప్రస్తుతం అక్కడ భూముల ధరలు పెరగడంలో దళారులు తయారై ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు తమ స్నేహితులని కొందరూ, అధికారులు తమ బంధువని కొందరు, తాము అధికారుల దగ్గర పనిచేస్తున్నాం... మీకు పట్టాలు ఇప్పిస్తామని మరి కొందరు ఫోర్జరీ సంతకాలు, దొంగ పట్టాలు తయారు చేసి అసైన్డ్ పట్టాలు, పాస్‌పుస్తకాలు తయారు చేసి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అలాంటి వారిని ఎవరూ నమ్మొద్దన్నారు. నకిలీ పట్టాలు తయారు చేస్తున్న వారిపై కఠిన చర్యలకు అధికారులను ఆదేశించామన్నారు. అసైన్డ్ పట్టాలు అమ్మడం, కొనడం నేరమన్నారు. చట్టాలపై అవగాహన లేకుండా తక్కువ ధరలకు పట్టాలు ఇప్పిస్తామని చెప్పడంతో ఆశకు పోయి కొనుగోలు చేయవద్దన్నారు. రెవెన్యూ అధికారులు స్థానికంగానే ఉంటున్నారని, వారి దృష్టికి తీసుకుని రావాలన్నారు. ప్రజలకు అవగాహన లేకపోవడం వల్లే బ్రోకర్లు, దళారులు మోసం చేస్తున్నారన్నారు. నిజంగా అర్హులై ఉంటే నేరుగా తమ దగ్గరికి వస్తే ప్రభుత్వ అందచేస్తున్న జగనన్న కాలనీల్లో అర్హులకు ఇళ్ల పట్టాలు, కాలనీలు అందజేస్తామని తెలిపారు.


సీఐకు ఫిర్యాదు చేస్తున్న ఆర్డీఓ టీ అజయ్ కుమార్

అర్బన్ కాలనీ, పాపిరెడ్డి కాలనీల్లోనే..

అర్బన్ కాలనీ, సూరపాపిరెడ్డి కాలనీల్లో ఇచ్చిన ఇళ్ల పట్టాల్లోనే ఎక్కువగా దళారులు, బ్రోకర్లు ప్రజలను మోసం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అక్కడ కొందరు బ్రోకర్లను గుర్తించామని, రహస్యంగా వారి గృహాలపై దాడులు జరిపి వారిని త్వరలో పట్టుకుంటామన్నారు. తొలుత ఫోర్జరీ సంతకాలు పెట్టి, దొంగ పట్టాలు, పాస్ పుస్తకాలు తయారు చేసిన జగన్నాథం సురేష్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆర్డీఓ టీ అజయ్ కుమార్ సీఐ శివ రామకృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ యు పుల్లారావు, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, డీఏఏ బసిరెడ్డి, కిషోర్ రెడ్డి, రమేష్ తదితరులు ఉన్నారు.

ఇక నుంచి తర్లుపాడు పోలీస్ స్టేషన్

- తాడివారిపల్లి స్టేషన్ పేరు మారుస్తూ రాష్ట్ర హోం శాఖ ఉత్తర్వులు
- ఎస్పీ మలికాగర్గ్ చొరవతో తొలగిన ఇబ్బందులు

ఒంగోలు టౌన్/తర్లుపాడు: అది మండల కేంద్రమైన తర్లుపాడు. ఇక్కడి పోలీసు స్టేషన్ పేరు మాత్రం తాడివారిపల్లి పేరుతో ఉంటుంది. దీంతో స్టేషన్ పేరు మార్చాలని మండల ప్రజలు తరచూ పోలీస్ అధికారులకు విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. ఈ విషయాన్ని ఎస్పీ మలికా గర్గ్ దృష్టికి సైతం తీసుకెళ్లారు. దీనిపై స్పందిన ఎస్పీ పోలీసు స్టేషన్ పేరు మార్పు గురించి రాష్ట్ర హోం శాఖ అధికారులతో మాట్లాడారు.

అవసరమైన ప్రతిపాదనలను పంపడంతో తర్లుపాడు పోలీసు స్టేషన్ పేరు మారుస్తూ రాష్ట్ర హోం శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దర్శి సబ్ డివిజన్‌లో పొదిలి సర్కిల్ పరిధిలో ఉన్న తాడివారిపల్లిలో 2001లో పోలీసు స్టేషన్ ఏర్పాటు చేశారు. ఇది తర్లుపాడు మండలంలో ఒక మూలన ఉంది. 2017లో ఈ పోలీసు స్టేషన్‌ను తర్లుపాడుకు మార్చారు. కానీ రికార్డుల్లో తాడేవారిపల్లి పోలీసు స్టేషన్ పేరు అలానే కొనసాగడంతో ప్రజలతోపాటు ఫిర్యాదుదారులు కాస్త అయోమయానికి గురయ్యేవారు. ఇక అధికారిక కార్యక్రమాలకు కూడా ఇది సమస్యగా పరిణమించడంతో ఎస్పీ మలికా గర్గ్ ప్రత్యేక చొరవ తీసుకుని పోలీసు స్టేషన్ పేరు మార్చాలని హోం శాఖకు ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు హోం శాఖ ఉత్తర్వులు జారీ చేయడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తర్లుపాడు పోలీసు స్టేషన్

కేజీబీవీ పోస్టులకు నేటి నుంచి స్కిల్ టెస్ట్

చీమకుర్తి: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 37 కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న సీఆర్‌టీ, పీజీటీ, ప్రిన్సిపాల్, పీఈటీ పోస్టులకు ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు స్కిల్ టెస్ట్/ డెమో క్లాసులు నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ పి.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన వారిలో నుంచి 1:3 నిష్పత్తిలో సబ్జెక్టులు, కేటగిరీ వారీగా స్కిల్ టెస్ట్‌కు పిలిచినట్లు తెలిపారు. స్కిల్ టెస్ట్‌కు తేదీల వారీగా ప్రకటించిన షెడ్యూల్‌ను వెల్లడించారు.

■ 6వ తేదీన పీజీటీ–బోటనీ, కెమిస్ట్రీ, సివిక్స్, కామర్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకున్నవారు

■ 7వ తేదీన పీజీటీ–ఇంగ్లిష్, హిస్టరీ, మేథమేటిక్స్ సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకున్నవారు

■ 8వ తేదీన పీజీటీ–ఫిజిక్స్, జువాలజీ, ఒకేషనల్ హార్టికల్చర్ సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకున్నవారు

■ 9వ తేదీన ప్రిన్సిపాల్, సీఆర్‌టీ–బయో సైన్స్, సీఆర్‌టీ–ఇంగ్లిష్, సీఆర్‌టీ–హిందీ, సీఆర్‌టీ–మేథమేటిక్స్, సీఆర్‌టీ–ఫిజికల్ సైన్స్, సీఆర్‌టీ–సోషల్, సీఆర్‌టీ–తెలుగు సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకున్న వారు స్కిల్ టెస్ట్‌కు హాజరు కావాలని సమగ్ర శిక్ష ఏపీసీ సూచించారు.

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి

- పీటీసీ ప్రిన్సిపాల్ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: ప్రాక్సినేట్ సెక్యూరిటీ శిక్షణలో నేర్చుకున్న మెళకువలను తరచూ పునశ్చరణ చేసుకుంటూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని పోలీసు కళాశాల ప్రిన్సిపాల్ ఏఆర్ దామోదర్ సూచించారు. ఒంగోలులోని పోలీసు శిక్షణా కళాశాలలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు ప్రాక్సినేట్ సెక్యూరిటీ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఇంటెలిజెన్స్ డీజీపీ ఆదేశాల మేరకు స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ ఇంటెలిజెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణా తరగతులకు రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన 53 మంది మహిళా కానిస్టేబుళ్లు హాజరయ్యారు. బుధవారం శిక్షణ ముగింపు సందర్భంగా పీటీసీ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కార్యక్రమాల్లో మహిళా సమూహాల నుంచి ఎలాంటి అసౌకర్యం, హానీ కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో స్పెషల్ సెక్యూరిటీ గ్రూపు డిప్యూటీ డైరెక్టర్ డి.ఆశీర్వాదం, సెక్యూరిటీ ఆఫీసర్ మోహన్‌రావు, పోలీసు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేజేఎం చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

70 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత


సీజ్ చేసిన బియ్యం ఆటో వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ముండ్లమూరు: తాళ్లూరు నుంచి ముండ్లమూరుకు అక్రమంగా తరలిస్తున్న 70 బస్తాల రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ముండ్లమూరు మండలంలోని శింగనపాలెం వద్ద బుధవారం సీజ్ చేశారు. బియ్యంతోపాటు ఆటోను ముండ్లమూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు డీసీఎస్‌ఓ కె.అశోక్‌కుమార్ తెలిపారు. సీజ్ చేసిన బియ్యం విలువ 1.29 లక్షలు ఉంటుందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు.

మైనారిటీ బాలుర పాఠశాలలో స్పాట్ అడ్మిషన్స్

చీమకుర్తి: నెల్లూరులోని మైనారిటీ బాలుర పాఠశాలలో 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఎలాంటి ప్రవేశ పరీక్ష రాయకుండానే నేరుగా అడ్మిషన్ పొందవచ్చని గురుకుల పాఠశాలల ప్రకాశం జిల్లా కన్వీనర్ వి.మెర్సీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, పల్నాడు, తిరుపతి, బాపట్ల జిల్లాలకు చెందిన ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన్, బౌద్ధ మతాలకు చెందిన మైనారిటీ విద్యార్థులకు పాఠశాలలో ఖాళీలను బట్టి ప్రవేశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 8వ తేదీలోగా చేరాలని, వివరాలకు 9701222078ను సంప్రదించాలని సూచించారు.

ఏఎన్‌ఎంను వేధించిన డాక్టర్‌ను సస్పెండ్ చేయాలి

- ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్

యర్రగొండపాలెం: ఏఎన్‌ఎంను వేధించి ఆత్మహత్యాయత్నానికి పురిగొల్పిన డాక్టర్‌ను సస్పెండ్ చేసి, సమగ్రంగా విచారించిన ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. పుల్లలచెరువు మండలంలోని నాయుడు పాలెం పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్న దేవికాబాయి తనను డాక్టర్ కంచర్ల నాగార్జున గౌడ్ వేధింపులకు గురిచేస్తున్నాడంటూ ఈ నెల 3వ తేదీన వైద్యశాలలో యాంటీబయోటిక్ సిరప్ మోతాదుకు మించి తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం విదితమే. ఈ ఘటన పూర్వాపరాలు తెలుసుకోవడానికి ఎస్టీ కమిషన్ సభ్యుడు బుధవారం యర్రగొండపాలెం వచ్చారు. ఇక్కడి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న దేవికాబాయిని పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. 11 ఏళ్లుగా వైద్యశాలలో విధులు నిర్వర్తిస్తున్న దేవికాబాయిని డాక్టర్ 6 నెలలుగా వ్యక్తిగతంగా, మానసికంగా, లైంగికంగా వేధిస్తున్నాడని తన విచారణలో తెలిసిందన్నారు. బాధిత మహిళకు ఎస్టీ కమిషన్ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. డాక్టర్‌ను విధుల నుంచి తప్పించి విచారణ చేపడితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, అప్పుడే చట్టపరంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్, ఎస్పీని కోరినట్లు చెప్పారు.


బాధితురాలు దేవికాబాయిని పరామర్శిస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్

గిరిజన ఉద్యోగులను మానసికంగా వేధింపులకు గురిచేయడం హేయమైన చర్య అని అన్నారు. వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని, తప్పు చేసిన వారికి శిక్ష తప్పదన్నారు. ముందుగా ఈ ఘటన పూర్వాపరాలపై మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి, సీఐ కె.మారుతీకృష్ణతో శంకర్‌నాయక్ చర్చించారు. సమావేశంలో జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు రాములు నాయక్, పుల్లలచెరువు జెడ్పీటీసీ సభ్యుడు రమావత్ వాగ్యానాయక్, సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, మంత్రూనాయక్, ఆలిండియా బంజార సేవా సంఘ నాయకులు బద్దేనాయక్, నాగేశ్వరనాయక్ పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే బాధిత రైతులకు
త్వరలోనే పరిహారం

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరావు


సోమవరప్పాడు వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే భూములను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

పొదిలి రూరల్/పీసీపల్లి/మర్రిపూడి/ముండ్లమూరు: విజయవాడ–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులందరికీ ప్రభుత్వం త్వరలోనే నష్ట పరిహారం అందిస్తుందని జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లాలోని పలు మండలాల్లో గ్రీన్ ఫీల్డ్ హైవేకు సేకరించిన భూములను, సెకండ్ ఫేజ్‌లో భాగంగా సేకరించాల్సిన భూములను జేసీ బుధవారం పరిశీలించారు. రైతుల సమస్యలు, అభ్యంతరాలు తెలుసుకున్నారు.

= పొదిలి మండలంలోని ఉప్పలపాడు, తలమళ్ల గ్రామాల్లో ఎక్స్‌ప్రెస్ హైవే కోసం సేకరించిన భూములను జేసీ పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ఎక్స్‌ప్రెస్ హైవేకు సంబంధించి భూసేకరణ పూర్తయినట్లు తెలిపారు. భూములు కోల్పోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం మార్కెట్ ధర ప్రకారం నష్ట పరిహారం చెల్లించనుందన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. నష్ట పరిహారం పెంచాలని కోరారు. మార్కెట్ విలువ ప్రకారం ఎకరా రూ.9.50 లక్షలు మాత్రమే ఉందని, ప్రైవేట్ మార్కెట్‌లో ఎకరా రూ.25 లక్షల నుంచి రూ.80 లక్షలు పలుకుతోందని వివరించారు. ఎకరానికి కనీసం రూ.25 లక్షలు చెల్లించే విధంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని జేసీని వేడుకున్నారు. జేసీ వెంట కనిగిరి ఆర్డీఓ అజయ్ కుమార్, తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, ఆర్ఐ కిలారి సుబ్బారావు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయండి

సీఎస్ పురంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన జేసీని ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నేతలు కలిసి సమస్యలు విన్నవించారు. హైవే నిర్మాణంతో అసైన్డ్ భూములు, చుక్కల భూములు కోల్పోతున్న రైతులకు కూడా నష్టపరిహారం అందించాలని సీపీఎం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు కోరారు. రైతులకు ఇచ్చే పరిహారం పెంచాలని విజ్ఞప్తి చేశారు. సీఎస్‌పురం వద్ద నిర్మిస్తున్న జంక్షన్ వల్ల అనేక మంది రైతులు తమకున్న కొద్దిపాటి భూములను కోల్పోతున్నారని, చిన్న సన్నకారు రైతుల భూములు నష్టపోకుండా అదే ప్రాంతంలో 147 సర్వే నెంబర్‌లో జంక్షన్ నిర్మించాలని కోరారు. అంబవరం, బోయమడుగుల సర్పంచ్‌లు బొట్ల చిరంజీవి, కొండయ్య, ఉపసర్పంచ్ మిరియం వెంకటేశ్వర్లు, సీఎస్‌పురం మాజీ సర్పంచ్ మన్నేపల్లి రమణమ్మ, పలువురు రైతులు జాయింట్ కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. జేసీ వెంట ఆర్డీఓతోపాటు తహసీల్దార్ ఎస్‌కే నాగూల్ మీరా, వీఆర్‌ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

= గ్రీన్‌ఫీల్డ్ హైవే సెకండ్ ఫేజ్ భూసేకరణలో భాగంగా మర్రిపూడి మండలంలోని పన్నూరు, మర్రిపూడి, కూచిపూడి, తిప్పలదేవిపల్లి, గార్లపేట గ్రామాల్లో ఎంత భూమి అవసరమో స్థానిక అధికారులతో జేసీ చర్చించారు. భూముల రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీఓతోపాటు తహసీల్దార్ సీహెచ్ కృష్ణారావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

= తాళ్లూరు మండలంలోని సోమవరప్పాడు, తాళ్లూరు రెవెన్యూ గ్రామాల పరిధిలోని పొలాలను జేసీ పరిశీలించారు. రైతులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మండల స్థాయి అధికారులు పంపిన భూ నివేదికలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆయన వెంట ఆర్డీఓ విశ్వేశ్వరరావు, తహసీల్దార్ కేవీ ప్రసాద్, సర్వేయర్ బాబురావు, వీఆర్వో రాఘవరెడ్డి, చంద్రశేఖర్ రైతులు పాల్గొన్నారు.